ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న కంచర్ల శివారెడ్డి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నియోజకవర్గంలో పేరుకుపోయిన చాలా సమస్యలను పరిష్కరించానని, ఇంకా ఏమైనా మిగిలి ఉంటే వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



పల్టాన్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి అక్బర్‌బాగ్‌లో పర్యటించారు. పల్టాన్‌లో ఉన్న వాటర్ పొల్యూషన్, లోప్రెషర్ సమస్యలను పరిశీలించారు. సమస్య తలెత్తడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ పొల్యూషన్, లోప్రెషర్ లేకుండా వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, వాటర్ వర్క్స్ జీఎం మహమ్మద్ ఖాదర్ మోహినుద్దీన్, డీజీఎం షీలారాణి, మేనేజర్ యాసిన్ మహ్మద్, ఎంబీఎం నాయకులు బంటారం నాగరాజుగౌడ్, కైలాష్, కాలనీవాసులు ఉన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



ఆటోనగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సురాబాద్: మన్సురాబాద్ డివిజన్‌లోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో జరుగుతున్న అబివృద్ధి పనులను శుక్రవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు. రూ. 7.30 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నిధుల్లో రూ.3 కోట్లు సీసీ రోడ్లకు, రూ.40 లక్షలు ఎల్ఈడీ వీధి దీపాలకు, రూ.1.80 కోట్లు ఎస్‌టీపీ పనులకు మంజూరయ్యాయని కార్పొరేటర్ వివరించారు. విజయశ్రీ కాలనీ, శుభోదయ కాలనీ, జడ్జెస్‌కాలనీవాసులకు ప్రత్యామ్నాయంగా విజయవాడ జాతీయ రహదారి వరకు నిర్మిస్తున్న లింక్‌రోడ్డును హిందూ, ముస్లిం శ్మశాన వాటిక మధ్య నుంచి మన్సురాబాద్ చౌరస్తా వరకు ఉన్న కాలనీ వాసులు ఉపయోగించుకోవచ్చన్నారు. దీంతో సహారా రోడ్డులో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కార్పొరేటర్ నర్సింహారెడ్డి అన్నారు.

పూలే భవనంగా మార్చడం హర్షణీయం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: ప్రగతిభవన్ పేరును జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చడం హర్షణీయమని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి గొప్ప నిర్ణయం తీసుకున్నారని శుక్రవారం ఓల్డమలక్‌పేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నిర్ణయంతో రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కార వేదికగా పూలే భవన్ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, ఆకుల రాజు, రామకృష్ణ, వేముల విజయ్‌కుమార్, చల్లారి కృపాకర్, మధన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ గ్రేస్ మార్కులు పెంచాలని సీఎంకు వినతి

మలక్‌పేట: ఇంజినీరింగ్ విద్యార్థులు శుక్రవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో చేపట్టిన ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఉస్మానియా వర్సిటీ హైదరాబాద్ పరిధిలోని సీబీసీఎస్ సిస్టమ్ ఆఫ్ ఇంజినీరింగ్(బీఈ)లో చేరిన విద్యార్థులకు గ్రేస్ మార్కుల కేటాయింపును 0.5 నుంచి 1 శాతానికి పెంచాలని కోరుతూ సీఎంకు వారు వినతి పత్రం అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల నుంచి 2016, 2017 బ్యాచ్‌లకు చెందిన అనేక మంది ఇంజినీరింగ్ విద్యార్థులు చాలా సబ్జెక్టులు పూర్తి చేసినప్పటికీ.. 1, 2 సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఇంజినీరింగ్ డిగ్రీని పూర్తి చేసేందుకు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 0.5 గ్రేస్ మార్కుల విధానాన్ని సవరించి, ఒకటి శాతం గ్రేస్ మార్కులు కలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో విద్యార్థులు షేక్ అహ్మద్, రాఘవేందర్‌రావు, షబ్బీర్ అలీ, సింగ్, ఉమేష్, వీరేందర్‌యాదవ్, లతీఫ్ ఖాన్ ఉన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 15, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 35, కాకర 32, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 15, కారెట్ 35, దొండ 40, ఆలు 23, ఉల్లి 36, గోకర 40, దోస 23, సొర 08, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, ఆర్వి 40, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ 33, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 45.ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సర్వీస్ రోడ్ల ఆక్రమణతో ట్రా‘ఫికర్’

- పండ్ల మార్కెట్ వేరేచోటికి తరలించినా తప్పని ట్రాఫిక్ కష్టాలు
- సర్వీస్‌రోడ్డుపై డీసీఎంలు, చిరువ్యాపారుల తోపుడు బండ్లు తిష్ట
- రాకపోకలకు కాలనీవాసుల ఇక్కట్లు



సాయినగర్ ఐసీఐసీఐ బ్యాంక్ ముందు పండ్ల వ్యాపారుల వాహనాలతో నిండిన సర్వీస్‌రోడ్డు



ఓమ్ని ఆసుపత్రి ముందు రోడ్డులో డీసీఎం వాహనాన్ని నిలిపి వ్యాపారం చేస్తున్న దృశ్యం

చైతన్యపురి: గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ వల్ల కొత్తపేట, చైతన్యపురి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే ఉద్దేశంతో మార్కెట్‌ను వేరే చోటికి తరలించారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. చిరువ్యాపారులతో పాటు తోపుడుబండ్ల వారు, డీసీఎంలు ఆక్రమించడంతో సర్వీసు రోడ్డు కుంచించుకుపోయి వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

- చైతన్యపురి డివిజన్‌లోని చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట బీఎస్ఎన్ఎల్ కార్యాయం వరకు ఉన్న సర్వీస్ రోడ్డు, ఓమ్ని ఆసుపత్రి నుంచి నాగోల్ వెళ్లే రహదారులపై పండ్ల వ్యాపారులు చిన్న ఆటోలు, డీసీఎంల్లో పండ్లు పెట్టుకొని విక్రయిస్తున్నారు.
- ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌ల వల్ల ప్రభాత్ నగర్, సాయినగర్, చైతన్యపురి రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- చైతన్యపురి మెట్రో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల రాకపోకలకు కష్టంగా మారింది.
- సర్వీస్ రోడ్డు పక్కనే రెండు జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ట్రాఫిక్ జామ్ కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- చైతన్యపురి, ప్రభాత్‌నగర్, సత్యనారాయణపురం, మారుతీనగర్, సాయినగర్, కాలనీలకు ఈ సర్వీస్ రోడ్డుపైనే వెళ్లాల్సి ఉంటుంది.
- సర్వీస్ రోడ్డు ఆక్రమణలకు గురి కావటంతో ఉదయం, సాయం వేళల్లో వాహనాలపై కాదు... కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది.
- రద్దీ సమయాల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.
- ఫుట్ పాత్‌ను ఆక్రమించుకోవడమే కాక కొందరు సర్వీస్ రోడ్డుపైనే తమ వస్తువులు పెట్టుకుని వ్యాపారాలు కొనసాగించటం వల్ల సమస్య మరింత జటిలమవుతోంది.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డును ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరతున్నారు.



సర్వీస్ రోడ్డు ఆక్రమణలను తొలగించాలని దీక్ష చేస్తున్న కాలనీవాసులు, కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా (ఫైల్)

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించండి



చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు ఉన్న సర్వీసు రోడ్డు ఆక్రమణకు గురి కావటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీస్ రోడ్డులో కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా ఉండటం లేదు. ప్రభాత్‌నగర్ కాలనీలోకి కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లడం అంటే.. పద్మవ్యూహంలోకి వెళ్లినంత పని అవుతోంది. ఒక రోజు దీక్ష చేపట్టి నిరసన తెలిపినా ప్రయోజనం లేకుండా పోయింది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–వెంకట రమణా చౌదరి, ప్రభాత్‌నగర్ కాలనీ

అధికారులు పట్టించుకోవటం లేదు



ప్రభాత్‌నగర్, సాయినగర్ కాలనీవాసులతో కలిసి ఒక రోజు ఆందోళన చేసినా అధికారుల్లో స్పందన లేదు. సర్వీస్ రోడ్డులో పండ్ల వ్యాపారులు వాహనాలను నిలపకుండా చూడాలని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గత నెలలో కాలనీవాసులతో కలిసి దీక్ష కూడా చేశాం. ఆయా శాఖల అధికారులతో సమీక్షించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం అని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

–రంగా నర్సింహగుప్తా, చైతన్యపురి కార్పొరేటర్

రేపు ఆర్యవైశ్య సంఘం కార్తీక వనభోజనాలు

వనస్థలిపురం: వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న (ఆదివారం) వనస్థలిపురంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తడకమళ్ల విజయ్‌కుమార్, విట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు, అనంతరం వనభోజనాలు ఉంటాయన్నారు. సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

‘ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోండి’

హయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా శనివారం నుంచి రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అమలులోకి వస్తోందని ఆర్టీసీ హయత్‌నగర్-1 డిపో మేనేజర్ జలగం విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వయస్సుల మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియామకం



కొండ సాయి ప్రసాద్ గౌడ్

కాచిగూడ: ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్‌గా కొండ సాయి ప్రసాద్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ యువత సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఏబీవీపీలో కాలేజ్ సెక్రటరీ నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన కొండ సాయి ప్రసాద్‌ను పలువురు విద్యార్థులు అభినందించారు.

నాడు కళాకారుడు... నేడు అర్చకుడు

- చరమాంకంలో దుర్భర జీవితం
- ఆదరణ లేక అవస్థలు పడుతున్న నటుడు వెంకటేశ్వరరావు
- ఆదుకోవాలని వేడుకోలు



అబ్దుల్లాపూర్‌మెట్: అతను ఒకప్పుడు మంచి రికార్డింగ్ వాయిద్య కారుడు.. అంతే కాకుండా అలనాటి పాత కాలపు సంగీత విద్వాంసుల బృందంలో ఒక సభ్యుడు.. దీంతో పాటు పాతకాలం సినిమాలైన రంగస్థలంలో హరిచంద్రుడిగా, రాయబారంలో కృష్ణుడిగా, రామాంజనేయ యుద్ధంలో ఆంజనేయుడి వంటి పాత్రలతో పాటు అంతస్థులు, ప్రేమించి చూడు, అవేకళ్లు వంటి చిత్రాల్లో నటించిన ఆర్టిస్టు. అలాంటి కళాకారుడికి నేడు ఆదరణ కరువు అవ్వడంతో ఎనిమిది పదుల వయసులో ఇబ్బందులు పడుతున్నాడు. జానెడు పొట్ట కోసం జీతం లేకపోయినా చిన్న దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తూ భక్తులు ఇచ్చే దక్షిణంతోనే పూట వెల్లదీసుకుంటున్న ఆ నిరాధరణ కళాకారుడే ముత్యాల వెంకటేశ్వరరావు(85). పుట్టి పెరిగింది కృష్ణా జిల్లా గుడివాడలో అయినా 30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో ఉంటూ భార్యతో కలిసి అక్కడక్కడ హరికథలు చెప్పుకుంటూ జీవనం సాగించాడు. క్రమంగా హరికథలు, రంగస్థల నాటకాలకు ఆదరణ లేకపోవడంతో ఆయన రోజురోజుకు దీన స్థితికి చేరుకున్నారు. ఆర్థిక భారం వల్ల ఆయన భార్య ఏడాదిన్నర క్రితం మృతిచెందడంతో ఆయన రోడ్డున పడ్డారు. ఆదుకునే వారు లేకపోవడంతో ఇనాంగూడ గ్రామంలోని ఆంజనేయుడి దేవాలయంలో వేతనం లేకుండానే అర్చకుడిగా పనిచేస్తూ భక్తులు ఇచ్చే దక్షిణంతో జీవనం సాగిస్తున్నాడు. తన కళను మెచ్చి చిత్ర, సంగీత పరిశ్రమలకు చెందిన ప్రముఖుల నుంచి అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందినా వాటితో కడుపు నింపుకోలేని దుస్థితిలో ఉన్నానని, తనను ప్రభుత్వం కానీ, చిత్ర, సంగీత పరిశ్రమలు కానీ ఆదుకోవాలని వెంకటేశ్వరరావు (9849461848) వేడుకుంటున్నాడు. ఈయన ప్రముఖ సంగీత విద్వాంసులైన ర్యాలీ పిచ్చయ్యశాస్త్రి(ఘంటసాల మేనమామ), ఎం.ఎస్ బాలసుబ్రహ్మణ్య శర్మల వద్ద పనిచేశారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

నాగోలు: శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని వెంకటసాయి నగర్‌లో గల శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఇల్లు లేని నిరుపేదలకు లయన్స్ క్లబ్ తరపున దుప్పట్లు పంపిణీ చేశారు. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా సాయిబాబా ఆలయ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు కోరారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట అధ్యక్షుడు లయన్ కందుకూరి శ్రీనివాస్, జోనల్ చైర్మన్ లయన్ డాక్టర్ బి. విజయ రంగా, కృషి మహిళా సంఘం అధ్యక్షురాలు లయన్ సైకం రేణుక రెడ్డి, రేపల్లె ప్రభాకర్, తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

జైపురి కాలనీలోని మద్యం షాపును తొలగించాలి: బీఎస్పీ

నాగోలు: నాగోల్ డివిజన్ జైపురి కాలనీ వీకర్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలి ఎల్‌బీనగర్ బీఎస్పీ అధ్యక్షుడు గువ్వల సాయిరామకృష్ణ, ఇన్‌చార్జి యాదగిరి, ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో వారు జైపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మద్యం షాపు ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల జైపురికాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జైపురికాలనీలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల దాని ప్రభావం చిన్నారులపై ఎక్కువగా పడేందుకు అవకాశం ఉందని, ఈ షాపు వెంటనే మరో ప్రాంతాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నుంచి వైన్స్ తరలించకపోతే ఈ ప్రాంతంలోని ప్రజలంతా ఏకమై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఈ మద్యం షాపు ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చారని, ఆయనే ఈ షాపును తొలగింపజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కట్ల కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు ముందు ఆందోళన చేస్తున్న బీఎస్పీ అధ్యక్షుడు సాయిరామకృష్ణ తదితరులు

శ్మశాన వాటికలో అత్యాధునిక వసతులు

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశాన వాటికలో మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం సమితి సర్వసభ్య సమావేశం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా శ్మశాన వాటిక ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా శ్మశాన వాటికకు అనుబంధంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నిర్వహణతో పాటు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, ఫిజియో థెరపీ సేవలు, యోగా సెంటర్ ఏర్పాటు చేశామని, స్మశాన వాటిక ఆధ్వర్యంలో మూడు సత్రాల నిర్వహణ చేపట్టామన్నారు. శ్మశాన వాటికలో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు రాజ్‌కుమార్ విగ్, రాజేందర్ పటేల్, వీరస్వామి, విజయ్‌కుమార్, సి.నందకిషోర్, ఎం.మహేందర్, సత్యనారాయణ, మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మిర్యాల గూడెం నియోజకవర్గం నుంచి నూతనంగా ఎన్నికైన శాసన సభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్)ని శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి.

– దిల్‌సుఖ్‌నగర్

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బాబు శ్రీనివాస్.

– చాదర్‌ఘాట్



దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



నిందితులను చూపిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: రౌడీషీటర్‌తో కలిసి దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం సీఐ దేప జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ అడ్డగుట్ట సొసైటీ ప్రాంతానికి చెందిన పీలా ఈశ్వర్ గణేశ్ ఈనెల 1వ తేదీ సాయంత్రం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం కొత్తగూడెం నుంచి తన ముగ్గురు మిత్రులు విశ్వకాంత్, సుజిత్, విష్ణులతో కలిసి తన కారులో నగరం వైపు బయలుదేరాడు. మార్గం మధ్యలో పెద్దఅంబర్‌పేట వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు (టీఎస్04ఈఎస్ 8885) గణేశ్ కారును ఢీకొట్టి ముందుకు వెళ్లిపోయింది. దీంతో ఆ కారును వెంబడించి హైకోర్టు కాలనీకి వద్ద ఆపి తమ కారు ధ్వంసమైందని, మరమ్మతు కోసం నష్టపరిహారం చెల్లించాలని అడుగుతుండగా... అదే సమయంలో ద్విచక్ర వాహనం (టీఎస్ 07ఎఫ్ఆర్ 9914)పై వచ్చిన ముగ్గురు ఏం జరిగిందని అడిగారు. ఆ ముగ్గురిలో ఓ వ్యక్తి 'నా పేరు మంజునాథ్, వనస్థలిపురంలో రౌడీని, మీ సమస్యను పరిష్కరిస్తా' అని అన్నాడు. గణేశ్‌కు ఎయిర్ గన్ చూపించి మీ ఫోన్లు, మీ దగ్గర ఉన్న డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. నిరాకరించడంతో వారిపై దాడి చేసి ఐఫోన్, విలువైన నైక్ షూ గుంజుకున్నారు. బాధితుడు గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం గ్రామానికి చెందిన పోలోజు శరత్‌చంద్ర (22), కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ప్రశాంత్ (23)లను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.50 వేల నగదు, ఒక ఐఫోన్, ద్విచక్ర వాహనం, మరో రెండు మొబైల్ ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న రౌడీషీటర్ మంజునాథ్ కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్నామని సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపారు.



మూసివేసిన గాయత్రినగర్ ప్రధాన రహదారి



బురదమయంగా మారిన రోడ్డు

రహదారి.. పూర్తయ్యే దారేది!

- గాయత్రినగర్‌లో ప్రధాన మార్గ నిర్మాణ పనులు
- రోడ్డు మూసివేతతో వాహనదారుల తిప్పలు
- త్వరితగతిన చేయాలంటున్న స్థానికులు

మీర్‌పేట: రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యక్తిగత పనుల చేసుకోవాలంటే ప్రధాన రహదారి మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గాయత్రి నగర్ ప్రధాన రహదారి అభివృద్ధి పనులు నాలుగు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. పై కాలనీల నుంచి డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణాన్ని సాకుగా చూపిన గుత్తేదారు మొదట్లో నెల రోజుల పాటు పనులు మధ్యలోనే వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. ప్రధాన రహదారి కావడంతో పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చేసేది లేక ఇక్కట్లు పడుతూనే రాకపోకలు కొనసాగిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయకపోవడంతో గతంలో ఓ వృద్ధుడు, యువకుడు ద్విచక్ర వాహనాల పైనుంచి కిందపడి గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు వేగంగా జరగకపోవడం, రహదారిని మూసివేయడంతో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు తమ గోడును వెలిబుచ్చుతున్నారు.

వ్యాపారుల ఆవేదన..

రోడ్డు పనులు మొదలైనప్పటి నుంచి వ్యాపారాలు దెబ్బతిన్నాయని స్థానిక దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని తెలిపారు. దీంతో వ్యాపారం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని వాహనదారులు, కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం..

డ్రైనేజీ ఓవర్ ఫ్లో వల్ల మొదట్లో పనులు కొంత ఆలస్యమైంది. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వారంలోగా పూర్తి చేస్తాం.

– గోపీనాథ్ డీఈ, మీర్‌పేట